

శిథిలావస్థలో పురాతన వంతెన

- రామచంద్రపురం వద్ద వందేళ్ల క్రితం నిర్మాణం
- మరమ్మతులకు నోచుకోకపోవడంతో బలహీనంగా మారిన వారధి

-7లో





పంచాయతీ ఈవో రమేష్‌ను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట పంచాయతీ ఈవోపై ఎమ్మెల్యే కన్నెర్ర

- తాగునీటి సమస్య, అద్దె దుకాణాల కేటాయింపుల్లో అవకతవకలపై ప్రశ్నల వర్షం
- కొళాయిలకు అక్రమంగా డబ్బులు ఎందుకు వసూలు చేశారని నిలదీత
- సరైన సమాధానాలు చెప్పకుండా నీళ్లు నమిలిన ఈవో
- రెండు రోజుల్లో వాటర్ ట్యాంకులను వినియోగంలోకి తేవాలని ఎమ్మెల్యే ఆదేశం
- అక్రమాలు, విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం దృష్టి తీసుకెళతానని హెచ్చరిక

కశింకోట, సెప్టెంబరు 2 :

స్థానిక పంచాయతీ ఈవో తీరుపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తీవ్ర అసహం, ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారని, గ్రామంలో రెండేళ్ల క్రితం నిర్మించిన మినీవాటర్ ట్యాంకులను ఇంతవరకు ఎందుకు వినియోగంలోకి తీసుకురాలేదని నిలదీశారు. రెండు రోజుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించపోతే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనకాపల్లిఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ సోమవారం కశింకోట పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది, అధికారుల అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. పంచాయతీ ఈవో రమేశ్ సంతకం లేకపోవడంతో.. ఆయన ఎక్కడున్నారని ప్రశ్నించారు. బయటకు వెళ్లారని సిబ్బందిని బదులివ్వగా.. వెంటనే ఇక్కడకు రప్పించాలని ఆదేశించారు. కొద్దిసేపటికి ఈవో రమేశ్ పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నట్టు పంచాయతీ నుంచి చాలా ఫిర్యాదులు వచ్చాయని, ఇలా ఎందుకు జరుగుతున్నదని కొణతాల ప్రశ్నించారు. తాగునీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేస్తున్నామని ఈవో బదులివ్వడంతో.. మరి ప్రజలెందుకు తమకు ఫిర్యాదు చేస్తున్నారని నిలదీశారు. గ్రామంలో సుమారు రెండేళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకులు ఎందుకు అందుబాటులోకి తీసుకురాలేదని ప్రశ్నించగా.. విద్యుత్ కనక్షన్లు లేకపోవడంతో ... మిగతా 8వ పేజీలో

కూటమి ప్రభుత్వంపైనే జిల్లా వాసుల ఆశలు

సుజల స్రవంతి కదిలేనా!

- 15 ఏళ్ల క్రితం పునాది.. గత టీడీపీ హయాంలో పనులు ప్రారంభం
- తరువాత ఐదేళ్లపాటు గాలికొదిలేసిన వైసీపీ పాలకులు
- బడ్జెట్‌లో అరకొరగా నిధులు... అవి కూడా విడుదల చేయని వైనం
- భూ సేకరణకు రెండేళ్ల క్రితం ప్రాథమిక నోటిఫికేషన్
- పలు పత్రికల్లో రూ.7 కోట్లతో ప్రకటనలు
- తొలిదశ భూసేకరణకు 2023-24 బడ్జెట్‌లో రూ.141.79 కోట్లు కేటాయింపు



అనకాపల్లిలో సుజల స్రవంతి ప్రాజెక్టు భూసేకరణ విభాగం కార్యాలయం



కశింకోట మండలం తాళ్లపాలెం వద్ద ఆరేళ్ల క్రితం టీడీపీ హయాంలో జరిగిన కాలువ తవ్వకం పనులు (ఫైల్ ఫొటో)

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుపై జిల్లా వాసులు ఎన్నో ఆశలుపెట్టుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభం కాగా, ఈ ప్రాజెక్టును తామే పూర్తి చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ ఐదేళ్లలో పథకం పనుల్లో కనీస పురోగతి లేకపోయింది. భూసేకరణ కోసం అనకాపల్లిలో ఒక స్పెషల్ డిప్యూటీ కార్యాలయాన్ని ప్రారంభించి నిధులు విదల్చకుండా కాలక్షేపం చేసింది. భూసేకరణ ప్రాథమిక నోటిఫికేషన్‌కు పత్రికల్లో ప్రకటనల కోసం రూ.7 కోట్ల వరకు ఖర్చు చూపుతున్నా, భూసేకరణ పనులు మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఈ నేపథ్యంలో చంద్రబాబు నేతృత్వంలో ఏర్పాటైన కూటమి ప్రభుత్వం సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తిచేస్తుందని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

- ఒక్కరూపాయి కూడా విడుదల చేయని పరిస్థితి
- రెండేళ్లు పూర్తవ్వడంతో భూసేకరణ ప్రాథమిక నోటిఫికేషన్ రద్దు
- మాటలతోనే ఐదేళ్లపాటు కాలం వెళ్లదీసిన వైసీపీ పాలకులు

పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ నుంచి ఎత్తిపోతల ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు, 1,037 గ్రామాలకు తాగునీరు అందించేందుకు 2009 ఫిబ్రవరి 21న నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సబ్బవరంలో 'బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం' పేరుతో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 7,214 కోట్లుగా నిర్ణయించారు. రాజశేఖరరెడ్డి మరణం తరువాత నుంచి రాష్ట్ర విభజన వరకు పాలకులు ఎవరూ ఈ ప్రాజెక్టు గురించి పట్టించుకోలేదు.

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రాజెక్టులో కదలిక వచ్చింది. అయితే భూ సేకరణ చట్టం-2013 అమల్లోకి రావడం, నిర్వాసితులకు ఇచ్చే ప్యాకేజీలు పెరగడంతో ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.7,214 కోట్ల నుంచి రూ.16,568 కోట్లకు చేరింది. టీడీపీ హయాంలో దీనిని రెండు దశలుగా విభజించారు. తొలి దశలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు సంబంధించి రూ.2,022 కోట్లకు 2017లో గ్రీన్ సిగ్నల్ లభించింది. తొలిదశను రెండు ప్యాకేజీలుగా విభజించిన అధికారులు ప్యాకేజీ-1లో రూ.900 కోట్లకు టెండర్లు ఆహ్వానించారు. కాంట్రాక్టర్‌కు రూ.10 కోట్లు మొబిలైజేషన్ అడ్వాన్స్ కింద విడుదల చేశారు. 2018 నవంబరు 15న అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చోడవరంలో ఈ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కశింకోట మండలం తాళ్లపాలెం సమీపంలో కాంట్రాక్టర్ కాలువ తవ్వకం పనులు చేపట్టారు. మూడు నెలలు తిరిగేసరికి వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పటికి ప్రాజెక్టు వ్యయంలో 25 శాతం కంటే తక్కువ విలువైన పనులు చేపట్టిన టెండర్లను ప్రభుత్వం రద్దు చేసింది. అయితే అప్పటి వరకు చేపట్టిన పనులకు (మొబిలైజేషన్ అడ్వాన్స్ పోగా) రూ.5 కోట్లకుపైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఏ కారణం చేతనో ప్రభుత్వం కొంతకాలం తరువాత పాత కాంట్రాక్టర్‌తోనే పనులు కొనసాగించాలని నిర్ణయించింది. అయితే పనులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ చేపట్టకపోవడంతో కాంట్రాక్టర్ మిన్నకుండిపోయారు.

ఏటా బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు బడ్జెట్‌లో కనీసస్థాయిలో కూడా నిధులు కేటాయించడంలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది (2019-20) రూ.170.06 కోట్లు, 2020-21లో రూ.107.96 కోట్లు, 2021-22 లో రూ.79 కోట్లు మాత్రమే కేటాయించింది. కానీ ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదు. 2022-23 బడ్జెట్‌లో కూడా రూ.297.5 కోట్లు కేటాయించిందిగానీ విడుదల చేయలేదు.

కోటలు దాటిన జగన్ మాటలు..

గత ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి 2020 జనవరిలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించినప్పుడు.. సుజల స్రవంతి ప్రాజెక్టును 2023 చివరికల్లా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు రెండో దశను ఆరు ప్యాకేజీలుగా విభజించారు. వీటిలో రెండు ప్యాకేజీలకు రూ.3,800 కోట్లకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌ను ఖరారుచేసిన ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు సరికదా భూసేకరణ ప్రక్రియ పూర్తిచేయలేదు.

అనకాపల్లి భూసేకరణ కార్యాలయం

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పనులు జరగాలంటే భూసేకరణ అత్యంత కీలకం. తొలిదశ పనులకు 4,272 ఎకరాలు, రెండో దశ పనులకు 7,608 ఎకరాలు వెరసి సుమారు 12 వేల ఎకరాలు సేకరించాలి. 2021లో ... మిగతా 8వ పేజీలో

జడ్పీ సీఈవో పోస్టుకు పోటీ

- పలువురికి ప్రజా ప్రతినిధుల సిఫారసు లేఖలు
- నేతల మధ్య అంతరం
- మంత్రి లోకేశ్ దృష్టికి వ్యవహారం
- కీలక మండలాల ఎంపీడీవో పోస్టులకూ డిమాండ్
- ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తున్న వైనం



విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) పోస్టుకు పలువురు అధికారులు పోటీపడుతున్నారు. ఇప్పటికే ప్రజా ప్రతినిధులు కొందరి అధికారుల పేర్లను సిఫారసు చేస్తూ లేఖలు ఇచ్చారు. ప్రస్తుత సీఈవో పోలినాయుడు వ్యవసాయశాఖా మంత్రి అచ్చెన్నాయుడుకు ఓఎస్‌డీగా వెళ్లడంతో డిప్యూటీ సీఈవో సత్యనారాయణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఈ దశలో సీఈవోగా వచ్చేందుకు 1999, 2007 బ్యాచ్‌కు చెందిన ఎంపీడీవోలు పోటీ పడుతున్నారు.

జడ్పీ సీఈవో పోస్టు కోసం ఉమ్మడి జిల్లాలో పలువురు ప్రజా ప్రతినిధులు సిఫారసు లేఖలు ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఏపీఐఐసీలో పనిచేసి, ఆరోపణలు ఎదుర్కొన్న అధికారిని గ్రామీణ ప్రాంతానికి చెందిన కీలక ప్రజా ప్రతినిధి సిఫారసు చేయడం దుమారం రేపుతోంది. దీనిపై నాలుగు రోజుల క్రితం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి నారా లోకేశ్‌కు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఫిర్యాదు చేశారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజా ప్రతినిధులంతా ఒక మాట అనుకుని, సమర్థుడైన అధికారిని సిఫారసు చేస్తే వివాదం ఉండేది కాదు. అలాకాకుండా దాదాపు ముగ్గురి నుంచి నలుగురికి ప్రజా ప్రతినిధులు సిఫారసు లేఖలు ఇచ్చారు. ఏం జరుగుతుందో చూడాలి. సీఈవో పోస్టు వ్యవహారం ప్రజా ప్రతినిధుల మధ్య అంతరం పెంచిందని టీడీపీ వర్గాల అభిప్రాయం.

ఎంపీడీవో పోస్టులకూ పోటీ..

ఉమ్మడి జిల్లాలో 39 మండలాలు ఉండగా పెందుర్తి, దేవరాపల్లి, కె.కోటపాడు, వి.మాడుగుల, మాకవరపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాయకరావుపేట, చోడవరం, చీడికాడ, గొలుగొండ, నర్సీపట్నం, రోలుగుంట, సబ్బవరం, ఆనందపురం ఎంపీడీవోలు ఒకేచోట ఐదేళ్ల అంతకంటే ఎక్కువ సర్వీసు పూర్తిచేసుకున్నారు. ఖాళీగా ఉన్న ఐదు మండలాలకు ఎంపీడీవోలను నియమించాల్సి ఉంది. ఒకేచోట ఐదేళ్లకు పైగా పనిచేసిన అధికారులకు బదిలీ చేయాలని గత నెలలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో స్పష్టంచేస్తోంది. ఇంకా బదిలీలకు జీరో సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. దీని ప్రకారం పాయకరావుపేట, చోడవరం, చీడికాడ, గొలుగొండ, నర్సీపట్నం, రోలుగుంట, సబ్బవరం, ఆనందపురం తదితర ఎనిమిది మండలాల ఎంపీడీవోలు విధిగా బదిలీ కావాల్సిందే. ఐదేళ్ల కంటే తక్కువ సర్వీసున్న 12 మంది ఎంపీడీవోలు, అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా ఉమ్మడి జిల్లాకు రావాలని తొమ్మిది మంది ఎంపీడీవోలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎక్కువ మండలాల్లో ఎంపీడీవోలకు స్థానచలనం ఉంటుందని, అందుకు తగినట్టుగానే పలువురు ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తీసుకున్నారని సమాచారం. గత ప్రభుత్వంలో కీలక మండలాల్లో పనిచేసిన ఎంపీడీవోలు అప్పటి వైసీపీ నాయకులతో అంటకాగారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ... మిగతా 8వ పేజీలో


భారీగా రైళ్ల రద్దు

- జాబితాలో జన్మభూమి, రత్నాచల్, గోదావరి ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్, ఏపీ ఎక్స్‌ప్రెస్, ఉదయ్ ఎక్స్‌ప్రెస్, విశాఖ ఎక్స్‌ప్రెస్, కోరమండల్...
- నేటి నుంచి 7వ తేదీ వరకూ పలు సర్వీస్‌లు క్యాన్సిల్
- బోసిపోయిన స్టేషన్



రైళ్లు రద్దు కావడంతో బోసిపోయిన విశాఖ రైల్వే స్టేషన్

- వార్త 7వ పేజీలో



నిండు కుండలా కోనాం జలాశయం

ఖరీఫ్‌కు ధోకా లేనట్టే

- జలాశయాలకు కొనసాగుతున్న వరద
- చెరువులకు జలకళ
- వరి రైతుల్లో ఆనందం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

వాయుగుండం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో జలాశయాల నీటి మట్టాలు పెరుగుతున్నాయి. ప్రసుతం కురుస్తున్న తేలికపాటి జల్లులు, జలాశయాలు, చెరువులు నిండుతుండడంతో వరద చేరడంతో ఖరీఫ్‌లో వరిసాగు ఆశాజనకంగా వుంటుందని అన్నదాతలు భావిస్తున్నారు. నీరు అందుబాటులో లేనిప్రాంతాల్లో ఇప్పటివరకు వరినాట్లు వేయని రైతులకు, ఇటీవల కురిసిన వర్షాలు వరి సాగుకు దోహదం చేస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

రిజర్వాయర్లకు జలకళ

జిల్లాలో తాండవ, పెద్దేరు, కోనాం, రైవాడ, కల్యాణపులోవ జలాశయాలు వర్షపు నీటితో నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. మాడుగుల మండలం రావిపాలెం పెద్దేరు జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా 135.15 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో 290 క్యూసెక్కులు కాగా కుడి, ఎడమ కాలువల ద్వారా 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. చీడికాడ మండలం కోనాం జలాశయం గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లు కాగా ప్రస్తుతం 98.4 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో 220 క్యూసెక్కులుకాగా.. ఎగువ, దిగువ కాలువల ద్వారా 130 క్యూసెక్కులు విడిచి పెడుతున్నారు. దేవరాపల్లి మండలం రైవాడ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా సుమారు 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 108.69 మీటర్లకు చేరింది. తాండవ రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 377.7 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 1,000 క్యూసెక్కులు వుండగా, స్పిల్‌వే గేటు ద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు.. తాండవ కుడి, ఎడమ కాలువలకు 185 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. రావికమతం మండలంలోని కల్యాణపులోవ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 460 అగులు కాగా ఆదివారంనాటికే నీటిమట్టం 459.03 అడుగులకు చేరింది. 200 క్యూసెక్కుల వరద నీరుచేరుతున్నది. రెండు గేట్లు ఎత్తి అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా సాగునీటి చెరువుల్లోకి కూడా వర్షం నీరు బాగానే చేరింది. దీంతో ఖరీఫ్ వరిసాగు ఆశాజనకంగా వుంటుందని రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు.

ఈ ఏడాది 54 వేల హెక్టార్లలో వరి సాగు చేయాలన్న లక్ష్యంకాగా ఇంతవరకు 41 వేల హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయాధికారి జి.మోహన్‌రావు తెలిపారు. అచ్యుతాపురం, కశింకోట, ఎలమంచిలి, సబ్బవరం మండలాల్లో వరి నాట్లు కొనసాగుతున్నాయని, చోడవరం డివిజన్‌లో బుచ్చెయ్యపేట మినహా మిగిలిన మండలాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో మిగిలిన పొలాల్లో కూడా వరినాట్లు వేస్తారని పేర్కొన్నారు. జిల్లాలో మరో వారం రోజుల్లో 90 శాతం వరి నాట్లు పూర్తవుతాయని తెలిపారు.



ఇందేశమ్మ ఆలయం వద్ద రోడ్డుపై ఏర్పడిన భారీ గోతులు

ఇందేశమ్మఘాట్ రోడ్డులో అడుగుకో గొయ్యి!

కోటవురట్ల, సెప్టెంబరు 2: మండలంలోని ఇందేశమ్మ ఘాట్‌రోడ్డులో ప్రయాణమంటే వాహనదారులు, సామాన్య ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నర్సీపట్నం-అడ్డురోడ్డు మధ్య కోటవురట్ల మండలం రామచంద్రపురం నుంచి ఎస్.రాయవరం మండల సరిహద్దులోని దార్లపూడి శివారు వరకు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు మొత్తం ఛిద్రమైంది. ఆర్‌అండ్‌బీ పరిధిలోని ఈ రహదారికి గత ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా నిర్వహణ పనులు చేపట్టలేదు. దీంతో నానాటికీ గోతులు పెరిగిపోయి, అత్యంత దారుణంగా తయారైంది. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు నడపకపోవడంతో పలు మండలాల ప్రజలు ద్విచక్రవాహనాలు, ఆటోలపై ఆధారపడుతున్నారు. ఇందేశమ్మ ఘాట్‌రోడ్డు ప్రయాణిస్తుంటే ఒళ్లు హూనం అవుతున్నదని వాపోతున్నారు. అడుగడుగునా గోతులతో నిండిన ఈ రోడ్డులో రాత్రిపూట ప్రమాదాలబారిన పడుతున్నామని ద్విచక్రవాహదారులు ఆందోళన చెందుతున్నారు.



ఇది కాలువ కాదు.. రోడ్డే!



దార్లపూడి సమీపంలో రహదారి దుస్థితి

క్రైం... crime news

ప్రమాదవశాత్తూ చెరువులో పడి రైతు మృతి


మృతుడు సుర్ల అచ్చియ్యు నాయుడు(ఫైల్ ఫొటో)

రోలుగుంట, సెప్టెంబరు 2: మండలంలోని జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన ఓ రైతు ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతిచెందాడు. దీనికి సంబంధించి ఎస్‌ఐ సురేశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన సుర్ల అచ్చియ్యనాయుడు అనే రైతు ఆదివారం సాయంత్రం తన గేదెను కడగడానికి సమీపంలో ఉన్న ఎర్ర చెరువుకు తీసుకువెళ్లాడు. చెరువు లోపలికి వెళ్లిన గేదె ఊబిలో పడిపోవడంతో దాన్ని రక్షించే క్రమంలో అతను మృతి చెందాడు. అలాగే గేదె కూడా మృతి చెందింది. అచ్చియ్యనాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. అతని భార్య రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జీడిమామిడి తోటల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహం

కొత్తూరు, సెప్టెంబరు 2: అనకాపల్లి మండలంలో కోడూరు శివారు వున్న జీడిమామిడి తోటల్లో గుర్తు తెలియని మహిళ కళేబరాన్ని సోమవారం గుర్తించినట్టు రూరల్ ఎస్‌ఐ తేజేశ్వరరావు తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. సబ్బవరం మండలానికి చెందిన రాపర్తి అప్పారావుకు అనకాపల్లి మండలం కోడూరులో జీడిమామిడి తోట ఉంది. వేసవిలో జీడి పిక్కలు ఏరిన తరువాత ఆయన తోటల్లోకి రాలేదు. మూడు నెలల తరువాత సోమవారం జీడిమామిడి తోటకు వెళ్లాడు. ఇక్కడ ఒక కళేబరం కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, వైద్యుల సహాయంతో కళేబరాన్ని మహిళదిగా గుర్తించారు. కళేబరాన్ని పరీక్షల నిమిత్తం విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించామని, మృతురాలి వయసు 55-60 ఏళ్లు వుంటాయని ఎస్‌ఐ చెప్పారు.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు: ఎస్పీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

అనకాపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం ప్రజలు అందిస్తున్న ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి జాప్యం చేయవద్దని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమె ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరై పలువురి నుంచి ఫిర్యాదులు/ వినతులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ఆమె స్వయంగా మాట్లాడారు. ఫిర్యాదులపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ దేవప్రసాద్, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్‌ఐ దివ్య తదితరులు పాల్గొన్నారు.

కొండచిలువ హతం

కొయ్యూరు, సెప్టెంబరు 2: రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆదివారం అర్ధరాత్రి సుమారు 10 అడుగుల పొడవైన కొండ చిలువ హల్‌చల్ చేసింది. ఆ సమయంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది వసతి గృహాల్లోకి కొండచిలువ చొరబడి రోగులతో పాటు సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసింది. రోగులతో పాటు సిబ్బంది సుమారు గంట సేపు శ్రమించి కొండచిలువను హతమార్చారు.


హతమైన కొండచిలువ

భారీగా రైళ్ల రద్దు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీగా కురిసిన వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో రైల్వే లైన్లు పాడయ్యాయి. విజయవాడ డివిజన్‌లో ముమ్మరంగా జరుగుతున్న రైల్వే లైన్ల అభివృద్ధి పనులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. పలుచోట్ల రైలు పట్టాలపై వరద నీరు ప్రవహించడం, ఇంకొన్ని ట్రాక్‌లు పాడవ్వడంతో విశాఖ నుంచి, విశాఖ మీదుగా వెళ్లే అనేక రైళ్లను వాల్తేరు డివిజన్ అధికారులు రద్దు చేశారు. ఆదివారం నుంచి మొదలైన రైళ్ల రద్దు మంగళవారం కూడా కొనసాగుతుందని రైల్వే వర్గాలు తెలిపాయి.

మంగళవారం విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ (12739), విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ (20708), విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్ (20833), విశాఖ-గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22701), విశాఖ-మహబూబనగర్ సూపర్‌ఫాస్ట్ (12861), సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ (20707), సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ (20834), సికింద్రాబాద్-షాలిమార్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12774), మహబూబ్‌నగర్-విశాఖ సూపర్‌ఫాస్ట్ (12862), తిరుపతి-విశాఖ ప్రత్యేక రైలు (08584), ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-షాలిమార్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ (12842), లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806), సికింద్రాబాద్-భువనేశ్వర్ విశాఖ ఎక్స్‌ప్రెస్ (17016), హైదరాబాద్-కటక్ ప్రత్యేక రైలు (07165), బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12864) రద్దు చేశారు. 4న (బుధవారం) షాలిమార్-సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12773), న్యూఢిల్లీ-విశాఖ ఏపీ ఎక్స్‌ప్రెస్ (20806), ముంబై-భువనేశ్వర్ కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11019), తంబరం-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (22842), ఎర్నాకులం-హటియా ధార్తి ఏసీ ఎక్స్‌ప్రెస్ (22838), కటక్-హైదరాబాద్ ప్రత్యేక రైలు (07166), 5న ఎర్నాకులం-టాటానగర్ ఎక్స్‌ప్రెస్ (18189), 6న హౌరా-మైసూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22817), కొచువేలి-షాలిమార్ ప్రత్యేక రైలు (06081), 7న కన్యాకుమారి-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12666), తిరువేలి-పురిలియా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22606)లను రద్దు చేసినట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

మళ్లింపు మార్గంలో; మంగళవారం విశాఖ నుంచి న్యూఢిల్లీ వెళ్లే ఏపీ ఎక్స్‌ప్రెస్ (20805) వయా విజయనగరం, రాయగడ, రాయపూర్, నాగపూర్ మీదుగా, హైదరాబాద్ నుంచి విశాఖ వచ్చే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728) వయా పగిడిపల్లి, నల్గొండ, గుంటూరు మీదుగా నడుస్తాయి.

విశాఖ నుంచి వెళ్లే 12 రైళ్లు, విశాఖ మీదుగా వెళ్లే 19 రైళ్లు రద్దయ్యాయి. దాంతో ముందుగానే ప్రయాణాలు పెట్టుకున్నవారు, ఇతర ప్రాంతాల నుంచి విశాఖపట్నం వచ్చి, ఇక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లాలనుకున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం ముందుగా తెలుసుకున్నవారు ప్రయాణాలు రద్దు చేసుకోవడంతో విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఖాళీగా ఉంది. ఏ రైళ్లు రాకపోవడంతో ప్లాట్‌ఫారాలు బోసిపోతున్నాయి. ఇతర రైళ్లలో వచ్చి, మరో రైలు ఎక్కాల్సినవారు గత్యంతరం లేక ప్లాట్‌ఫారంపై కూర్చొని కాలక్షేపం చేస్తున్నారు.

నేడు విశాఖ నుంచి విజయవాడకు ప్రత్యేక రైలు

పలు రైళ్లు రద్దు అయిన నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం మంగళవారం విశాఖ నుంచి విజయవాడకు (ఒక వైపు) ప్రత్యేక రైలును అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08581 నంబర్‌తో ఈ రైలు మధ్యాహ్నం 12.55 గంటలకు విశాఖలో బయలుదేరి రాత్రి 7.15 గంటలకు విజయవాడ చేరుతుందన్నారు. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ నడిచే సమయంలో బయలుదేరే ఈ ప్రత్యేక రైలు 16 సెకండ్ క్లాస్ సిట్టింగ్, రెండు జనరల్ సెకండ్ క్లాస్, రెండు ఏసీ చైర్‌కార్, రెండు సెకండ్ క్లాస్ కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లతో నడుస్తుందన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	91.00
లైవ్ ధర	111.00
విత్ స్కిన్	192.00
స్కిన్ లెస్	202.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

శిథిలావస్థలో పురాతన వంతెన

- రామచంద్రపురం వద్ద వందేళ్ల క్రితం నిర్మాణం
- మరమ్మతులకు నోచుకోకపోవడంతో బలహీనంగా మారిన వారధి
- ఇప్పటికే ఒకవైపు కుంగిపోయి, బీటలు వారిన పిల్లర్లు
- ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన
- కొత్త వంతెన నిర్మించాలని అధికారులకు వినతి


శిథిలావస్థకు చేరిన వంతెన మీదుగా వెళుతున్న ఒక పక్కకు ఒరిగిన ఆర్టీసీ బస్సు. (ఇన్‌సెట్‌లో) శిథిలావస్థకు చేరిన పురాతన వంతెన


వంతెన వద్ద బస్సు దిగి... నడుచుకుంటూ వెళుతున్న ప్రయాణికులు

కోటవురట్ల, సెప్టెంబరు 2: మండలంలోని రామచంద్రపురం వద్ద నర్సీపట్నం- అడ్డరోడ్డు ప్రధాన రహదారిపై వున్న పురాతన వంతెన శిథిలావస్థకు చేరి, ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు, ఈ మార్గంలో ప్రయాణించే వారు ఆందోళన చెందుతున్నారు. సుమారు వంద సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ వంతెనకు ఎటువంటి మరమ్మతులు చేయకపోవడంతో బలహీనంగా మారింది. వంతెన మీదగా భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తూ ఆర్‌అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టినా... ఎవరూ పట్టించుకోవడం లేదు. 40 నుంచి 50 టన్నుల బరువుతో టిప్పర్ లారీలు వెళుతున్నాయి. గతంలో అధిక లోడుతో టిప్పర్ లారీ వెళ్లడంతో వంతెన ఒకవైపు కుంగిపోయి, శ్లాబ్, పిల్లర్లు బీటలు వారాయి. శ్లాబ్‌కింద వేసిన ఇనుప కమ్మీలు ఒగిపోయాయి. ఇదిలావుండగా మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో వంతెన మరింతా బలహీనంగా మారింది. దీంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్లు.. ఈ వంతెనకు ముందు ప్రయాణికులను దించి, ఖాళీ బస్సును వంతెన దాటిస్తున్నారు. తరువాత ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

వరిపైరుకు సకాలంలో పొటాష్ ఎరువు

- తెగుళ్లను తట్టుకొనే శక్తి పెరుగుతుంది
- ఎలమంచిలి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి


మామిడివాడ వద్ద వరి పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

ఎలమంచిలి/రాంబిల్లి, సెప్టెంబరు 2: వరినాటిన 30 రోజులలోపు ఎకరాకు 20 నుంచి 25 కిలోల పొటాష్ ఎరువును తప్పనిసరిగా వేసుకోవాలని, ఇదే సమయంలో యూరియా ఎరువును మోతాదుకు మించి వాడితే చీడపీడల ఉధృతి పెరిగే ప్రమాదం వుందని ఎలమంచిలి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి అన్నారు. సోమవారం ఎలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్‌లోని మామిడివాడ, చినకలవలాపల్లి, సోమలింగపాలెం, కట్టుపాలెం, జంగులూరు, వెలమపాలెం, వేమగిరి, సైతారుపేట గ్రామాల్లో శాస్త్రవేత్తల బృందం పర్యటించి వరి పొలాలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సబ్‌డివిజన్ పరిధిలో వరినాట్లు 70 శాతం మేర పూర్తయ్యాయని, మరో పక్షం రోజుల వరకు వరినాట్లు వేసుకోవచ్చని చెప్పారు. ఒకవేళ నారు ముదిరిపోతే.. చిగుళ్లను తుంచి నాటుకోవాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం వరినాట్లు పిలక దశలో వున్నాయని, సాలి పురుగులు, అక్షింతల పురుగులు, తూనీగలు వంటి మిత్ర పురుగులు అధికంగా ఉన్నందున వారం, పది రోజుల వరకు క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాల్సిన అవసరం లేదని చెప్పారు. ఎకరాకు పది చోట్ల పక్షిస్థావరాలు ఏర్పాటు చేయడం ద్వారా ఆకుముడత తెగులు ఉధృతిని తగ్గించవచ్చునన్నారు. వరిపైరుకు అవసరమైన మోతాదులో పొటాష్ ఎరువును రైతులు వాడడం లేదని, వరినాటిన నెల రోజుల్లో పొటాష్ ఎరువు వేస్తే.. మొక్కలకు తెగుళ్లను తట్టుకొనే శక్తి పెరుగుతుందని ఆమె తెలిపారు. ఇందుకు అవసరమైన జీవన ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో సగం ధరకే అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ భూసార ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్‌ఎస్ రామలక్ష్మి, బీసీటీ కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్, ఎలమంచిలి వ్యవసాయ శాఖ ఏడీ బి.ప్రభాకరరావు, అధికారులు సుమంత, పి.మోహన్‌రావు, సంతోషి, వీఏవోలు దేవతి, దివ్య ప్రసన్న, అభ్యుదయ, తదితరులు పాల్గొన్నారు.


వరి నాట్లు వేస్తున్న రైతులకు సూచనలు ఇస్తున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భవాని

నీట మునిగిన వరి పొలాలు.. శాస్త్రవేత్తల సందర్శన

నక్కపల్లి, సెప్టెంబరు 2: అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భవానీ, బీసీటీ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్రా, శాస్త్రవేత్త ప్రసాదరావు సోమవారం నక్కపల్లి మండలంలోని కాగిత, ఉద్దండపురం, గొడిచెర్ల గ్రామాల్లో వర్షాలకు నీట మునిగిన వరి పొలాలను పరిశీలించారు. పొలాల్లో నుంచి నీటి త్వరగా బయటకు పంపే ఏర్పాటు చేసుకోవాలని, ఎకరాకు 20 కిలోల చొప్పున పొటాష్, యూరియా ఎరువురు వేసుకోవాలని సూచించారు. వీరి వెంట పాయకరావుపేట వ్యవసాయశాఖ ఏడీ ఉమా ప్రసాద్, వీఏఏ రాకేశ్, ఏఈవో సత్యనారాయణ వున్నారు.

కోలుకుంటున్న విద్యార్థినులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల వద్ద తల్లిదండ్రులు

అరకులోయ, సెప్టెంబరు 2: డుంబ్రిగుడ మండలం జాముగుడ గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు కోలుకుంటున్నారని, సోమవారం మరో 12 మందిని డిశ్చార్జి చేశామని అరకులోయ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాము తెలిపారు. ఆ పాఠశాలలో కలుషిత ఆహారం తిని 75 మంది విద్యార్థినులు శుక్రవారం అస్వస్థతకు గురికాగా, అరకులోయ ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేసి ఆదివారం 54 మందిని డిశ్చార్జి చేసిన విషయం తెలిసిందే. మిగతా వారికి చికిత్స అందిస్తున్నామని ఆయన తెలిపారు. వారి ఆరోగ్యం బాగానే ఉందని, అయితే నీరసంగా ఉండడంతో ఆస్పత్రిలో ఉంచామని, ఒకట్రెండు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని ఆయన చెప్పారు.

విజయవాడ వరద బాధితులకు 1.5 లక్షల ఆహార ప్యాకెట్లు


పులిహోర ప్యాకెట్లు సిద్ధం చేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరదలకు చిక్కుకున్న విజయవాడ ప్రజలకు 1.5 లక్షల ఆహార ప్యాకెట్లు సరఫరా చేసేందుకు కలెక్టర్ ఎంఎన్. హరేందిరప్రసాద్ నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు సిబ్బందితో కలిసి ఆహారం తయారీలో నిమగ్నమయ్యారు. మంగళవారం ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాల కోసం మూడు రకాల ఆహార పదార్థాలు సిదం చేశారు. టిఫిన్, పులిహోర, వెజ్ బిర్యానీ ప్యాకెట్లను సింహాచలం దేవస్థానం, అక్షయపాత్రతోపాటు మరికొన్ని ప్రైవేటు కేటరింగ్ సంస్థలు సిద్ధం చేశాయి. వీటిని సోమవారం రాత్రి ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో తరలించేందుకు రైల్వేశాఖ ఒక బోగీ కేటాయించింది.

మహిళ పొట్టలో ఎముకల గూడు

- శస్త్రచికిత్స ద్వారా తొలగించిన కేజీహెచ్ వైద్యులు


తొలగించిన ఎముకల గూడు

విశాఖపట్నం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కింగ్ జార్జ్ ఆస్పత్రిలోని గైనకాలజీ విభాగానికి చెందిన వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను నిర్వహించారు. మహిళ పొట్టలో పేగులు చుట్టూ ఏర్పడిన ఎముకల గూడును శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. ఈ తరహా కేసులు ఇప్పటివరకూ దేశంలో 25 వరకు మాత్రమే నమోదయ్యాయని, విశాఖలో తొలిసారి ఇటువంటి శస్త్రచికిత్సను నిర్వహించినట్టు వైద్యులు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లాకు చెందిన 27 ఏళ్ల మహిళ గతంలో ఇద్దరికి జన్మనిచ్చింది. మూడేళ్ల కిందట మరోసారి గర్భం దాల్చింది. పిల్లలు వద్దనుకున్న ఆమె అబార్షన్ నిమిత్తం మందులు వినియోగించారు. అబార్షన్ అయినట్టు ఆమెకు వైద్యులు చెప్పారు. అయితే, అప్పటి నుంచి సదరు మహిళ తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ వస్తోంది. ఎంతమంది వైద్యులకు చూపించినా పరిష్కారం లభించలేదు. కొద్దిరోజుల కిందట కేజీహెచ్‌కు వచ్చిన ఆమెకు వైద్యులు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయించారు. ఈ స్కానింగ్‌లో కడుపులో కణితిని గుర్తించారు. పూర్తిస్థాయిలో స్పష్టత కోసం ఎంఆర్‌ఐ స్కానింగ్ చేయించగా, 24 వారాలు శిశువుకు సంబంధించిన ఎముకల గూడు ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. దీనినే వైద్య పరిభాషలో లిథోపెడియన్ (శిశువు ఎముకలగూడు)గా పేర్కొంటారని కేజీహెచ్ గైనిక్ విభాగం మూడో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. ఈ నేపథ్యంలో ఐ.వాణి, మూడో యూనిట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆనంద్ సహకారంతో శస్త్ర చికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్యులను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద అభినందించారు. ఆమె ఆరోగ్యంగా ఉందని, కోలుకుందని డాక్టర్ ఐ.వాణి తెలిపారు. మంగళవారం డిశ్చార్జ్ ఇస్తామన్నారు. అత్యంత అరుదుగా ఇటువంటి కేసులను చూస్తుంటామన్నారు.

వర్షాలతో జనం ఇబ్బంది పడకూడదు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, హాజరైన అధికారులు

- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు క్షేత్ర పర్యటనలు నిర్వహించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో వర్షాలు, నష్టాలపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాలతోపాటు వ్యాధులు ప్రబలే అవకాశాలు వున్నందున పట్టణాలు, గ్రామ పంచాయతీల్లో మురుగు కాలువల నిర్వహణ పనులు పక్కాగా జరగాలన్నారు. సురక్షిత తాగునీరు సరఫరా చేయడంతో పాటు పైపులైన్‌లు ఎక్కడా లీకేజీలు లేకుండా చూడాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు, చెట్లు, ఇళ్లు కూలిపోవడం వంటివి జరిగితే తక్షణమే స్పందించి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు తగిన సూచనలు చేసి, పంట నష్టపోకుండా చూడాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. అధిక వర్షాల వల్ల కలిగిన నష్టాలపై నివేదికలు రూపొందించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ బి.దయానిధి, ఆర్డీఓలు చిన్నికృష్ణ, జయరామ్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో భద్రతా చర్యలు చేపట్టాలి

సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వసతిగృహాల్లో మౌలిక వసతులు, విద్యార్థుల భద్రత విషయంలో రాజీ పడవద్దన్నారు. ముఖ్యంగా బాలికలను వసతిగృహాల నుంచి నుంచి బయటకు పంపాల్సి వస్తే, తప్పనిసరిగా ఎస్కార్ట్‌ను తోడుగా పంపాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వార్డెన్లు చెప్పాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు వసతిగృహాల్లో అందుబాటులో ఉండకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. మెనూను సక్రమంగా అమలు చేయాలని, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమావేశంలో బీసీ వెల్ఫేర్ ఈడీ కె.రాజేశ్వరి, డీటీడబ్ల్యూఓ నాగశిరీషా, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కోఆర్డినేటర్ రూపవతి, వార్డెన్లు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెరగాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెరగాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం విద్యా శాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలయ్యే చూడాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. విద్యార్థులు తాగడానికి వేడిచేసి చల్లార్చిన నీటిని అందుబాటులో వుంచాలని చెప్పారు. ఈ సమావేశంలో డీఈఓ ఎంవీ లక్ష్మమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాళ్లు, ఎంఈఓలు పాల్గొన్నారు.

అయోధ్య రాముని ధనస్సుకు ప్రత్యేక పూజలు


ధనస్సుకు పూజలు చేసిన భక్తులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 2: రామజన్మభూమి అయోధ్యలో శ్రీరామచంద్రమూర్తికి అందజేసే ధనస్సు, బాణానికి స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అయోధ్య భాగ్యనగర్ సీతారామ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు చల్లా శ్రీనివాసశాస్త్రి దేశవ్యాప్త ఊరేగింపులో భాగంగా కన్యకాపరమేశ్వరి దేవస్థానానికి తీసుకువచ్చారు. 13 కిలోల వెండి, ఒక కిలో బంగారంతో భక్తులు చెన్నైలో ఈ ధనస్సు, బాణాన్ని తయారు చేయించారు. అయోధ్యకు తీసుకువెళ్లే క్రమంలో భాగంగా స్థానిక ఆలయానికి తీసుకురావడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శతజయంతి ఉత్సవాల చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, డాక్టర్ శేషుకుమార్, బిళ్లపాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, శ్రీదరాల సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ముంపులోనే వరి పొలాలు


నీట మునిగిన పడాలపాలెంలోని వరి పంట పొలాలు

రోలుగుంట, సెప్టెంబరు 2: మండలంలోని పడాలపాలెం గ్రామంలో పంట పొలాలు నీట మునిగి చెరువుల్లా మారాయి. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా పంట పొలాలు నీట మునగడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. స్థానిక కొమరవోలు ఆవ నుంచి భారీగా నీరు రావడంతో సమీప పొలాలు మునిగిపోయాయి. సోమవారం కూడా ముంపులోనే ఉండడంతో తీవ్రంగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఈవోపై ఎమ్మెల్యే కొణతాల కన్నెర్ర

... 5వ పేజీ తరువాయి

వినియోగంలోకి తేలేకపోయామని ఈవో బదులిచ్చారు. అధికారి అయ్యి ఉండి ఇన్నిరోజులు ఎందుకు తాత్సారం చేశారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణకు ఫోన్‌చేసి మాట్లాడారు. తక్షణమే విద్యుత్ కనక్షన్ ఇచ్చి, వాటర్ ట్యాంకులకు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. 48 గంటల్లో తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే చర్యలు తప్పవని పంచాయతీ అధికారులను హెచ్చరించారు. కాగా పంచాయతీకి చెందిన ఏడు వాణిజ్య దుకాణాల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, వాటికి సంబంధించి పంచాయతీ చేసిన తీర్మానం కాపీలు ఇవ్వాలని ఈవో రమేశ్‌ను అడిగారు. ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో కొణతాల అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హెచ్చరించారు. జల్ జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కొళాయిలకు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు ఫిర్యాదులు వచ్చాయని, డబ్బులు ఎందుకు వసూలు చేశారని కొణతాల రామకృష్ణ ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో చలానా తీయడానికి డబ్బులు వసూలు చేశామని ఈవో బదులివ్వగా.. ఉచితంగా కొళాయిలు వేయాల్సి వుండగా డబ్బులు వసూలు చేసి అవినీతికి పాల్పడాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. జల్ జీవన్ మిషన్ పథకం కింద పైపు లైన్ల నిర్మాణం జరిగి రెండేళ్లు అయినప్పటికీ ఇంటింటికీ తాగునీరు అందించకపోవడం అన్యాయమన్నారు. ఈ విషయాలన్నింటినీ ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి విచారణ చేపడతామని కొణతాల చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు వేగి గోపీకృష్ణ, సిద్దిరెడ్డి శ్రీను, కాండ్రేగుల సతీశ్, వేగి దొరబాబు, బుదిరెడ్డి చిన్న, బుదిరెడ్డి మోహన్, తాకాశి కృష్ణ, పావాడ కామరాజు, వేగి రామకోటి తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ సీఈవో పోస్టుకు పోటీ

... 5వ పేజీ తరువాయి

వారంతా కూటమి నేతలచుట్టు తిరుగుతూ అనుకూలంగా పనిచేస్తామని నమ్మబలుకుతున్నారు. నగర పరిసరాలు, మైదానంలో జాతీయ రహదారికి ఆనుకుని మండలాల్లో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని విధిగా ఏజెన్సీకి బదిలీ చేయాలని, అక్కడి ఎంపీడీవోలు కోరుతున్నారు. మైదానంలో అవకాశం దొరుకుతుందని అభిప్రాయపడుతున్నారు.

సుజల స్రవంతి కదిలేనా!

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి, చీపురుపల్లిల్లో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లను (భూసేకరణ) నియమించారు. అనకాపల్లి కార్యాలయాన్ని విశాఖలో ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసి అధికారిని నియమించినా అందుకు అధికారిక ఉత్తర్వులు లేకపోవడంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి. కొంతమంది సిబ్బంది కశింకోట, అనకాపల్లి, సబ్బవరం మండలాల్లో ప్రధాన కాలువ తవ్వకాలకు అవసరమైన భూసేకరణ సర్వే పనులు చేపట్టారు. అనకాపల్లిలో భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కార్యాలయాన్ని 2022 మే నెలలో ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. జిల్లాలో భూ సేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. అనకాపల్లి, కశింకోట, సబ్బవరం మండలాల్లో 22 గ్రామాల్లో 1,800 ఎకరాలు సేకరించాలని భావించారు. 2024 మే నెల నాటికి భూసేకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ భూసేకరణ పనులు ముందుకు కదల్లేదు. తొలిదశ భూసేకరణ కోసం 2023-24 బడ్జెట్‌లో వైసీపీ ప్రభుత్వం రూ.141.79 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించినా, రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో భూసేకరణ పనులు పడకేశాయి.

వైసీపీ ప్రభుత్వ తీరుతోనే ఈ దుస్థితి....

నిబంధనల ప్రకారం భూసేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసిన ఏడాదిలోగా తుది నోటిఫికేషన్ జారీ చేయాలి. భూసేకరణ విభాగానికి నిధులు విడుదల చేయకపోవడంతో మరో ఏడాది గడువు పెంచాలని అప్పటి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయినా.. నిధులు మాత్రం విడుదల చేయలేదు. దీంతో గడువు పూర్తవ్వడంతో భూసేకరణ ప్రాథమిక నోటిఫికేషన్ రద్దయ్యింది. కానీ భూసేకరణకు పాథమిక నోటిఫికేషన్ జారీకి పలు తెలుగు, ఆంగ్ల దినపత్రికలకు ప్రకటనల కోసం రూ.7 కోట్లు ఖర్చు చేసింది. కానీ బిల్లులు మాత్రం చెల్లించలేదు. అయినప్పటికీ ప్రకటనలు ప్రచురించిన పత్రికలకు బిల్లులు చెల్లించక తప్పదు. భూసేకరణ విభాగం కార్యాలయంలో సిబ్బంది ఎటువంటి పనులు లేక ఖాళీగా ఉంటున్నారు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

సుజల స్రవంతి పథకం పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందని జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువ అక్విడక్టు పనుల పరిశీలనకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు.. సుజల స్రవంతి పనుల వేగవంతానికి సమగ్ర నివేదిక అందజేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో కూటమి ప్రభుత్వం హయాంలో భూసేకరణతో పాటు ప్రాజెక్టు నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తవుతాయని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

తెరిపిచ్చిన వాన



ఎలమంచిలి మునిసిపాలిటీ కట్టుపాలెం సమీపంలో పొలాలను పరిశీలిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, రంగనాయకులు

- ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు రంగంలోకి దిగిన కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు
- పలు గ్రామాలతో పాటు పంట పొలాలకు వెళ్లి జరిగిన నష్టం పరిశీలన
- నీట మునిగిన వరి పొలాలను సంరక్షించేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు



రాంబిల్లి మండలం నారాయణపురంలో శారదా నది ఉధృత ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్



వర్షాల వల్ల జరిగిన నష్టంపై అధికారుల సమీక్షలో వివరాలు తెలుసుకుంటున్న నర్సీపట్నం ఆర్డీవో జయరాం

రాంబిల్లి, సెప్టెంబరు 2 : అల్పపీడనం ప్రభావం కారణంగా కురిసిన భారీ వర్షాలు సోమవారానికి తగ్గుముఖం పట్టారు. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో కూటమి నేతలతో పాటు, వివిధ శాఖల అధికారులు బృందాలుగా విడిపోయి ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా నదులు జోరుగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ రాంబిల్లి మండలంలోని నారాయణపురం బ్రిడ్జి వద్ద మైనర్ శారదా నదిని పరిశీలించారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చూడాలని, పంట పొలాలు ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వి.దిన్‌బాబు, జనసేన నాయకురాలు త్రివేణి కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే, ముంపునకు గురైన మర్రిపాలెం, కుమ్మరాపల్లిలోని వరి పొలాలను టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి.రంగనాయకులు తదితరులు పరిశీలించారు. నాయకులు సేనాపతి నాగేశ్వరరావు, అచ్చిబాబు, ఎం.నాగేశ్వరరావు, అమలుకంటి తాతాజీ, దొర, జనపరెడ్డి చిన్న, ధర్మరాజు, మూలరాజు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : మునిసిపాలిటీ పరిధి కట్టుపాలెం, సోమలింగపాలెం గ్రామాల్లోని మైనర్ శారదా నది పరీవాహక ప్రాంతాల్లో టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు పార్టీ శ్రేణులతో కలిసి సోమవారం పర్యటించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న నదిని, గట్లను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నది ఉధృతంగా ఉన్నందున రైతులు నిర్లక్ష్యంగా ఉండరాదని సూచించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దూళి రంగనాయకులు, నియోజకవర్గ రైతు నాయకుడు కొఠారు సాంబ, స్థానిక నాయకులు పందూరి శ్రీను, యల్లపు శ్రీను పందూరి నానాజీ, నగిరెడ్డి రాము, టి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : తుఫాన్ వల్ల కురిసిన వర్షాలకు ఎక్కడైనా నష్టం జరిగితే వెంటనే నివేదికలు సిద్ధం చేయాలని ఆర్డీవో జయరాం ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలు, ఇతర సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. తుఫాన్ అనంతర పరిస్థితులపై ఆరా తీశారు. వారం రోజుల్లో మరో తుఫాన్ ముప్పు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

కశింకోట : మండలంలోని వెదురుపర్తి, బయ్యవరం గ్రామాల్లో వరి పంటలను జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు సోమవారం పరిశీలించారు ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. వరి ఆకు మడుల్లో ఐదు సెంట్లకు కేజీ యూరియా, కేజీ పొటాష్ వేసుకోవాలన్నారు. వరి ఊడ్చిన పొలంలో ఎకరాకు యూరియా 20 కేజీలు, పొటాష్ 20 కేజీలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఎం.రామారావు, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ముకుందరావు, పెథాలజీ శాస్త్రవేత్త చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారి ఎం.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

'పర్యావరణ పరిరక్షకుడు మట్టి వినాయకుడు'



గ్రామంలో మట్టి వినాయక ప్రతిమలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కశింకోట, సెప్టెంబరు 2 : 'పర్యావరణ పరిరక్షకుడు మట్టి వినాయకుడు' అనే నినాదంలో సోమవారం మండలంలోని వెదురుపర్తిలో ర్యాలీ నిర్వహించారు. స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా ఐదు వందల మందికి మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ చేశారు. అనంతరం సదరు ప్రతిమలను చేత బట్టి గ్రామ పురవీధుల్లో ప్రదర్శనగా వెళ్లి అక్కడివారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన జెడ్సీ

అనకాపల్లి టౌన్ : ఇక్కడి జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం జెడ్సీ అయ్యప్పనాయుడు మొక్కలు నాటారు. జనసేన పార్టీ నాయకులు కాండ్రేగుల శ్రీరామ్, దూలం గోపి తదితరులు పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేశారు.



శిథిల తుఫాన్ రక్షిత భవనాలు పరిశీలన

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 2 : వెంకటనగరంలో నర్సీపట్నం ఆర్డీవో జయరాం సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఉన్న శిథిల తుఫాన్ రక్షిత భవనాన్ని పరిశీలించారు. ఈ భవనాన్ని తొలగించాలని సర్పంచ్ వంకా వెంకటరమణ కోరారు. తహసీల్దార్ కె.జయప్రకాశ్, ఆర్ఐ త్రినాథ్, టీడీపీ నాయకులు వంకా శివ, వంకా హరి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాన్ని పరిశీలించిన తహసీల్దార్

నక్కపల్లి, సెప్టెంబరు 2 : ఇక్కడి డాక్టర్ అంబేడ్కర్ బాలికల గురుకులాన్ని సోమవారం తహసీల్దార్ అంబేడ్కర్ పరిశీలించారు. వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు, వైరల్ ఫీవర్స్ ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాల్, టీచర్లకు సూచించారు. సాధ్యమైనంత వరకూ కాచి చల్లార్చిన నీటినే ఇవ్వాలన్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా ? లేదా అని అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అనకాపల్లిలో హోటళ్లు తనిఖీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 2 : పట్టణంలోని పలు హోటళ్లను ఫుడ్ సేఫ్టీ అధికారి సతీష్‌కుమార్ సోమవారం రాత్రి తనిఖీ చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని గల హోటల్ వంట గదిని పరిశీలించారు. నిల్వ ఉన్న మాంసాన్ని గుర్తించి పారబోయించినట్టు ఆయన వెంట ఉన్న రెవెన్యూ అధికారులు తెలిపారు. వంటగదిలో పరిశుభ్రత పాటించాలని, నిల్వ ఉన్న పదార్థాలు అమ్మకాలు చేయరాదని సతీష్‌కుమార్ హెచ్చరించారు.

ఎన్టీఆర్ వైద్యాలయం ఎదుట కార్మికుల నిరసన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 2 : ఎన్టీఆర్ వైద్యాలయంలో పనిచేస్తున్న కార్మికులు ఆస్పత్రి ఎదుట రెండో రోజైన సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు నెలలు తరబడి జీతాలు చెల్లించక పోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు చెప్పారు. బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ఈ నెల 15 తరువాత విధులు బహిష్కరించి ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వరప్రసాద్, నూకరాజు, సంతోష్, రాంప్రసాద్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 2 : పారిశుధ్య నీటి సరఫరా, క్లాప్ తదితర కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట సోమవారం వారంతా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల ఎంప్లాయిస్ యూనియన్ అనకాపల్లి జోన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో తాము చేపట్టిన ఆందోళన సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ నెల 16వ తేదీ తర్వాత ఎప్పుడైనా సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. అనంతరం జెడ్సీ అయ్యప్పనాయుడును కలిసి సమ్మె నోటీసు అందజేశారు. నిమ్మకాయల అజయ్, బి. రాము, శివకుమార్, ఏసురాజు, నాగరాజు, సంతోష్ పాల్గొన్నారు.

వాడవాడలా వైఎస్‌కు వైసీపీ శ్రేణుల నివాళి



అనకాపల్లి, ఎలమంచిలిలలో వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 2 : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం పట్టణంలోని పలుచోట్ల నిర్వహించారు. రింగురోడ్డులోని పార్టీ కార్యాలయంలో, చిననాలుగురోడ్ల జంక్షన్, జాతీయ రహదారిలోని పూడిమడక వెళ్లే జంక్షన్‌లో ఆయన విగ్రహాలకు వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఆళ్ల నాగేశ్వరరావు, కొణతాల మురళీకృష్ణ, మలసాల కుమార్‌రాజా, కెఎం నాయుడు, దంతులూరి దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి : పట్టణంలో వైఎస్ వర్ధంతిని మాజీ ఎమ్మెల్యే యు.వి.రమణ మూర్తిరాజు (కన్నబాబు) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద గల వైఎస్ విగ్రహానికి ఆయనతో పాటు ఎంపీపీ బోదెపు గోవింద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, నాయకులు, కౌన్సిలర్లు దాసరి కుమార్, కోడిగుడ్డు రమణబాబు, త్రినాథ్, నూకేశ్వరరావు, దూది నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ వర్ధంతిని పాయకరావుపేటలో నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు. వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జడ్పీటీసీ లంక సూరిబాబు, పార్టీ పట్టణ అధ్యక్షులు ధనిశెట్టి బాబి. నాయకులు ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, సరపు తాతారావు, జగతా శ్రీను పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్ వర్ధంతిని జరిపారు. సత్యవరంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ మండలఅధ్యక్షుడు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ సఖినేటి రాము, తమిర్సి గంగారావు, పాల్గొన్నారు.

నక్కపల్లి : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ వర్ధంతిని మండలంలో వైసీపీ నాయకులు జరుపుకున్నారు. నక్కపల్లి పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, పొడగట్ల పాపారావు, సూరకాసుల గోవింద్, కొప్పిశెట్టి హరి, కొల్నాటి బుజ్జి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపమాకలో వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరిపారు.

కోటవురట్ల : వైఎస్ వర్ధంతిని కోటవురట్ల, పాములవాక, కె.వెంకటాపురం గ్రామాల్లో నిర్వహించారు. ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సాగి సీతాబాబు కోటవురట్ల జంక్షన్‌లో పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ మండల కన్వీనర్ కిల్లాడ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ఉమాదేవి, మాజీ జడ్పీటీసీ వంతర వెంకటలక్ష్మి, సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ వంగలపూడి రాంబాబు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్ వర్ధంతిని వైసీపీ నాయకులు జరిపారు. భీమవరంలో ఆ పార్టీ నాయకుడు గరగా నానిబాబు తదితరులు రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్.రాయవరం, అడ్డరోడ్డు, ధర్మవరం అగ్రహారం గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : వైఎస్ వర్ధంతిని మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. వైసీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరరావు ఆధ్వర్యంలో అచ్యుతాపురం జంక్షన్‌లోని ఆయన విగ్రహం వద్ద పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పూడిమడక, దుప్పితూరు, నరేంద్రపురం తదితర గ్రామాల్లో వైఎస్‌కు ఆ పార్టీ నాయకులు అంజలి ఘటించారు.

రాంబిల్లి : మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్ వర్ధంతిని జరిపారు. రాంబిల్లిలో ఎంపీపీ శిరీషా శ్రీనుబాబు, జడ్పీటీసీ ధూళి నాగరాజు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దిమిలిలో ఎలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్, నాయకులు నగిరెడ్డి మురళీకృష్ణ, అగ్రహారపు బాబూరావు, కుమ్మరాపల్లి సర్పంచ్ శ్రీను, గెదెల శ్రీను తదితరులు వైఎస్‌కు అంజలి ఘటించారు. ఈ కార్యక్రమాల్లో వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

మునగపాక : వైఎస్ వర్ధంతిని మునగపాకలో నిర్వహించారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ హాజరై ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చంనాయుడు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, కాండ్రేగుల వెంకటలక్ష్మి, మద్దాల వీరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : మండల వ్యాప్తంగా వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని జరిపారు. పరవాడ సంతబయలు వద్ద గల ఆయన విగ్రహానికి వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి, జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు చుక్క రామునాయుడు, బూస అప్పలరాజు, వెన్నెల సన్యాసిరావు, కూండ్రపు సీతారామయ్య గొర్లి గోపి, బండారు రామారావు పాల్గొన్నారు.

సబ్బవరం : వైఎస్ వర్ధంతిని సబ్బవరంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ దెడ్డం ప్రసాద్, ఎంపీటీసీ ఖైలపూడి దేముడుబాబు, నాయకులు గండి రవికుమార్, బోకం రామునాయుడు, కర్రి బాబు, కొటాన రాము పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

- కేక్‌లు కట్ చేసిన కూటమి నాయకులు
- రక్తదాన శిబిరాలు, విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహణ



అనకాపల్లి జనసేన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పీలాకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

కొత్తూరు, సెప్టెంబరు 2 : ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు సోమవారం వాడవాడలా ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అనకాపల్లి రింగురోడ్డులో గల జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నెహ్రూచౌక్ కూడలిలో మొక్కలు, మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సంపతిపురం పంచాయతీ తమ్మయ్యపేటలో మేము సైతం సమాజం కోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సర్పంచ్ నంబారు నాగమణి, టీడీపీ సీనియర్ నాయకుడు నంబారు శ్రీను పాల్గొన్నారు.

కశింకోట : మండల కేంద్రం కశింకోటలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జనసేన మండల అధ్యక్షుడు బుదిరెడ్డి చిన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరై పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, కూటమి నేతలు బుదిరెడ్డి మోహన్, వేగి గోపీకృష్ణ, బుదిరెడ్డి చిన్న, కాండ్రేగుల సతీష్, దాడి నాగరాజు, సిదిరెడ్డి శ్రీనివాసరావు, వేగి రామకోటి, కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట/రూరల్ : పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు పాయకరావుపేటలో ఘనంగా జరిగాయి. జనసేన కార్యాలయం ఎదుట ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, జిల్లా గ్రంథాలయ సంస్థమాజీ చైర్మన్ తోట నగేశ్ తదితరులు కేక్‌కట్ చేశారు. నాయకులు గెడ్డం చైతన్య, ఆకాష్, దేవవరపు రఘు, ఆచంట దొర, జగ్గన్నదొర, పల్లి దుర్గారావు, ఇంజరపు సూరిబాబు, బి.ఎస్.నారాయణ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు. అలాగే, మంగవరం, పాల్తేరు, సత్యవరం, అరట్లకోట, గుంటపల్లి తదితర గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు కేక్‌లు కట్‌చేశారు. మంగవరంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, జనసేన నాయకులు తోట నగేశ్, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, గెడ్డ ఆకాష్, చైతన్య, కట్టా దొర, దేవవరపు రఘు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి : పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మండలంలో కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ ముఖ్య నేత గెడ్డం బుజ్జి, మరికొన్ని గ్రామాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్‌ల ఆధ్వర్యంలో ఈ వేడుకలను జరిపారు. పార్టీ మండల అధ్యక్షుడు వెలగా సుధాకర్, నాయకులు నల్లల రత్నాజీ, పాము గణేశ్, కురందాసు సింహాచలం, తోట అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఉపమాకలో టీడీపీ నాయకులు ఈ వేడుకలను జరిపారు. ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సర్పంచ్ ప్రగడ వీరబాబు, కొప్పిశెట్టి శ్రీను, సుంకర శ్రీను, డీలర్ హరిబాబు, తోలేటి శ్రీను,బాలు పాల్గొన్నారు.

కోటవురట్ల : పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను కోటవురట్ల, కైలాసపట్నం, సుంకపూర్ తదితర గ్రామాల్లో కూటమి నాయకులు నిర్వహించారు. కైలాసపట్నంలో జనసేన నాయకుడు సిద్దాబత్తుల దొరబాబు చీరలు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, జనసేన మండల అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు, బోడపాటి శివదత్తతు, ఎంపీటీసీ సూర్యారావు, సుంకర్‌బాబ్జి పాల్గొన్నారు.

ఎలమంచిలి : పట్టణంలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను కూటమి నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఇక్కడి జనసేన ప్రాంతీయ కార్యాలయం ఆవరణలో ఆ పార్టీ రాష్ట్ర ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. రైల్వే స్టేషన్ రోడ్డులో సతీష్ మొక్కలు నాటారు. సీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు, కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలోని అనాథలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కూటమి నాయకులు బొద్దపు శ్రీను, గొర్లె నానాజీ, కొఠారు సాంబ, లవుడు లోవరాజు, కొఠారు శ్రీను, కొఠారు నరేష్, కరణం రవి, గణేష్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మండలంలో నిర్వహించారు. అడ్డరోడ్డు తిమ్మాపురంలో జనసేన మండల సీనియర్ నేత సేనాపతి బాబూరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటైంది. జేవీ పాలెంలో టీడీపీ సీనియర్ నేత వజ్రపు శంకరరావు ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. సర్వసిద్ధి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎస్‌వీ శక్తిప్రియ మొక్కలు నాటారు. రేవుపోలవరంలో టీడీపీ సీనియర్ నేత కోడ లోవరాజు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

అచ్యుతాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. కొండకర్లలోని ఇచ్ఛా ఫౌండేషన్‌లో గల ప్రత్యేక అవసరాల పిల్లల ఆశ్రమ పాఠశాలలో ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కేక్ కట్‌చేసి, పిల్లలకు స్వీట్లు పంచిపెట్టారు. అలాగే, పలుచోట్ల మొక్కలు నాటారు. రామన్నపాలెం, ఖాజీపాలెం, నునపర్తి, ఉప్పవరం పూడిమడకలలో ఈ వేడుకలను జరిపారు. పెద్ద సంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని పలు గ్రామాల్లో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాంబిల్లిలో కూటమి నేతలు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, డి.రంగనాయకులు, గిరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోదరుడు, జనసేన నాయకుడు సతీష్‌కుమార్ హాజరై కేక్‌కట్ చేశారు. హైస్కూల్లో మొక్కలు నాటారు. లాలం కోడూరులో జనసేన నేత లాలం చందు, గోకివాడలో ఎంపీటీసీ అల్లవరపు బాబ్జి, కొత్తూరులో ఎంపీటీసీ సన్యాసిరావు, సర్పంచ్ అప్పలనర్స, దిమిలి మాజీ సర్పంచ్ కొటాపు వడ్డికాసులు తదితరుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



అచ్యుతాపురం మండలం కొండకర్ల ఇచ్ఛా ఫౌండేషన్‌లో పవన్ జన్మదిన కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు



ఎలమంచిలి జనసేన కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న జనసేన పార్టీ రాష్ట్ర ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్

మునగపాక : మండల కేంద్రం మునగపాకలోని జనసేన కార్యాలయంలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పరవాడ : పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా సోమవారం ఇక్కడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మొక్కలు నాటారు. అనంతరం పీహెచ్‌సీలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, కూటమి నాయకులు కన్నూరు వెంకటరమణ, మోటూరు సన్యాసినాయుడు, వియ్యపు చిన్న, రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. తానాంలో మంత్రిరాజు చెరువు వద్ద మాజీ జడ్పీటీసీ పైలా జగన్నాథరావు, సర్పంచ్ కన్నూరు దేవి కొబ్బరి మొక్కలను నాటారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, ఉప సర్పంచ్ వర్రి మంగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని పలు గ్రామాల్లో ఈ వేడుకలను జరిపారు. అలాగే, జనసేన రూరల్ జిల్లా కార్యదర్శి బడిగి రామగోవిందరావు ఆధ్వర్యంలో స్థానిక గౌతులచ్చన్న నగర్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తదితరులు ప్రారంభించారు.

సబ్బవరం : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల క్లీన్- గ్రీన్ కార్యక్రమాన్ని చేపట్టారు. సబ్బవరం, అనకపల్లిలో రక్తదాన శిబిరాలు ఏర్పాటయ్యాయి. గొటివాడలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పవన్ జన్మదిన కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. జనసేన నేత బలిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కూటమి నేతలు ఇందలి రమణ, కర్రి కనకరాజు, గొంప నర్సింగరావు, బలిరెడ్డి అప్పారావు, సాలాపు మీన, వెంకటేశ్వరరావు,బొండా సత్యారావు, శరగడం రాము, రామకృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

ఆదోని సబ్ కలెక్టర్‌గా నర్సీపట్నానికి చెందిన భరద్వాజ్


మౌర్య భరద్వాజ్

నర్సీపట్నం, సెప్టెంబరు 2 : పట్టణానికి చెందిన మంత్రి మౌర్య భరద్వాజ్ కర్నూలు జిల్లా ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్‌గా మంగళవారం విధుల్లో చేరనున్నారు. 2022లో ఆలిండియా సర్వీసెస్ కోసం యూపీఎస్సీ నిర్వహించిన పరీక్షలలో ఆయన 28వ ర్యాంక్ సాధించారు. శిక్షణలో భాగంగా 45 రోజుల పాటు భారత్ దర్శన్ పర్యటన చేశారు. ఆ తర్వాత ఉత్తరాఖండ్ రాష్ట్రం ముస్సోరి, కడపలో రెండేళ్ల శిక్షణ పూర్తి చేసుకున్నారు. దీంతో ఆయనను కర్నూలు జిల్లా ఆదోని డివిజన్ సబ్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించడంతో మంగళవారం ఆయన విధుల్లో చేరుతున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు సత్యప్రసాద్, రాధాకుమారి ఆశీర్వాదం తీసుకోవడానికి ఆదివారం నర్సీపట్నం విచ్చేశారు. తల్లిదండ్రులతో కలిసి మంగళవారం ఉదయం విమానంలో కర్నూలు బయలు దేరుతున్నారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం కడపలో శిక్షణ తీసుకున్న నేపథ్యంలో ఆ ప్రాంత ప్రజల స్థితి గతులు, సమస్య మీదఫై అవగాహన ఉన్నట్టు చెప్పారు.

'వర్షాల వల్ల వరి పంటకు నష్టం లేదు'

నర్సీపట్నం, సెప్టెంబరు 2 : తుఫాన్ ప్రభావం వల్ల వరి పంటకు ఎటువంటి నష్టం లేదని వ్యవసాయ శాఖ ఏడీ శ్రీదేవి తెలిపారు. సోమవారం ముంపు సమస్య తెలుసుకోవడానికి ఆమె మండలంలోని పలు ప్రాంతాలలో వరి పంటను పరిశీలించారు. వరి సాధారణ విస్తీర్ణం 11,497 హెక్టార్లు కాగా 8,883 హెక్టార్లలో 80 శాతం నాట్లు వేశారని తెలిపారు. ఈ పంటపై తుఫాను ప్రభావం లేదన్నారు. ఈ ప్రాంతంలో సాగవుతున్న వరి రకాలు మూడు నాలుగు రోజులు ముంపును తట్టుకోగలవని తెలిపారు. వరి పంటలో నీరు ఉంటే వీలైనంత త్వరగా తీసేయాలని సూచించారు. ఎకరానికి 30 కేజీలు యూరియా, 15 కేజీలు పొటాష్ ఎరువులు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో అప్పారావు, ఏఈవో శ్రీహరి, వీఏఏ వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

5న మరిడిమాంబ పండగ



కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 2 : గొలుగొండ మండలం పాత కృష్ణాదేవిపేట గ్రామదేవత మరిడిమాంబ పండగ ఈ నెల ఐదో తేదీన జరగనుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు వేకువజాము నుంచి పూజలు ప్రారంభం కానున్నాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాల్సిందిగా సర్పంచ్ సత్యంనాయుడు కోరారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు

▸▸ పలు చోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టిన జనసైనికులు



రక్తదాన శిబిరంలో జనసేన నాయకులు చక్రవర్తి, హరినాథ్, సురేశ్

నర్సీపట్నం అర్బన్, సెప్టెంబరు 2 : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడి ఏరియా ఆస్పత్రిలో రోగులకు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో పాలు, రొట్టెలు, పండ్లను పంపిణీ చేశారు. ముందుగా కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి పరిపాలనాధికారి నీలవేణి, జనసేన పట్టణ అధ్యక్షుడు అద్దేపల్లి గణేస్ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కశిమిలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో ముప్ఫై గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. గొలుగొండగ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ మండల యూత్ అధ్యక్షుడు వాసం వెంకటేష్, బోయిన చిరంజీవి, అల్లు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : రక్తదానంతో నిండు ప్రాణాలను కాపాడవచ్చునని జనసేన విశాఖ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు ఊడి చక్రవర్తి అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా గొలుగొండ మండలం పాతకృష్ణాదేవిపేటలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఉప సర్పంచ్ దుంపలపూడి సహదేముడు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరాన్ని తొలుత ప్రారంభించి మాట్లాడారు. సుమారు 65మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం ఎంపీపీ పాఠశాలలో మొక్కలు నాటారు. కృష్ణాదేవిపేట పీహెచ్‌సీలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు పంచాడ హరినాథ్, అల్లాడ సురేష్, లంక సత్యనారాయణ, అనిశెట్టి గోపి, ఈర్ని చిన్ని, శివాజీ, ప్రసాద్, నాగేశ్వరరావు, కొంగసింగి, నాగాపురం, పాతకృష్ణాదేవిపేట గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

జడ్పీ సీఈవో పోస్టుకు పోటీ

... 5వ పేజీ తరువాయి

వారంతా కూటమి నేతలచుట్టు తిరుగుతూ అనుకూలంగా పనిచేస్తామని నమ్మబలుకుతున్నారు. నగర పరిసరాలు, మైదానంలో జాతీయ రహదారికి ఆనుకుని మండలాల్లో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని విధిగా ఏజెన్సీకి బదిలీ చేయాలని, అక్కడి ఎంపీడీవోలు కోరుతున్నారు. మైదానంలో అవకాశం దొరుకుతుందని అభిప్రాయపడుతున్నారు.

సుజల స్రవంతి కదిలేనా!

... 5వ పేజీ తరువాయి

అనకాపల్లి, చీపురుపల్లిల్లో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లను (భూసేకరణ) నియమించారు. అనకాపల్లి కార్యాలయాన్ని విశాఖలో ఇరిగేషన్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసి అధికారిని నియమించినా అందుకు అధికారిక ఉత్తర్వులు లేకపోవడంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి. కొంతమంది సిబ్బంది కశింకోట, అనకాపల్లి, సబ్బవరం మండలాల్లో ప్రధాన కాలువ తవ్వకాలకు అవసరమైన భూసేకరణ సర్వే పనులు చేపట్టారు. అనకాపల్లిలో భూసేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కార్యాలయాన్ని 2022 మే నెలలో ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. జిల్లాలో భూ సేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. అనకాపల్లి, కశింకోట, సబ్బవరం మండలాల్లో 22 గ్రామాల్లో 1,800 ఎకరాలు సేకరించాలని భావించారు. 2024 మే నెల నాటికి భూసేకరణ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ భూసేకరణ పనులు ముందుకు కదల్లేదు. తొలిదశ భూసేకరణ కోసం 2023-24 బడ్జెట్‌లో వైసీపీ ప్రభుత్వం రూ.141.79 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించినా, రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో భూసేకరణ పనులు పడకేశాయి.

వైసీపీ ప్రభుత్వ తీరుతోనే ఈ దుస్థితి....

నిబంధనల ప్రకారం భూసేకరణకు ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసిన ఏడాది లోగా తుది నోటిఫికేషన్ జారీ చేయాలి. భూసేకరణ విభాగానికి నిధులు విడుదల చేయకపోవడంతో మరో ఏడాది గడువు పెంచాలని అప్పటి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయినా.. నిధులు మాత్రం విడుదల చేయలేదు. దీంతో గడువు పూర్తవ్వడంతో భూసేకరణ ప్రాథమిక నోటిఫికేషన్ రద్దయ్యింది. కానీ భూసేకరణకు పాథమిక నోటిఫికేషన్ జారీకి పలు తెలుగు, ఆంగ్ల దినపత్రికలకు ప్రకటనల కోసం రూ.7 కోట్లు ఖర్చు చేసింది. కానీ బిల్లులు మాత్రం చెల్లించలేదు. అయినప్పటికీ ప్రకటనలు ప్రచురించిన పత్రికలకు బిల్లులు చెల్లించక తప్పదు. భూసేకరణ విభాగం కార్యాలయంలో సిబ్బంది ఎటువంటి పనులు లేక ఖాళీగా ఉంటున్నారు.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

సుజల స్రవంతి పథకం పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందని జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువ అక్విడక్టు పనుల పరిశీలనకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడు.. సుజల స్రవంతి పనుల వేగవంతానికి సమగ్ర నివేదిక అందజేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. దీంతో కూటమి ప్రభుత్వం హయాంలో భూసేకరణతో పాటు ప్రాజెక్టు నిర్మాణ పనులు త్వరతగతిన పూర్తవుతాయని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

వాడవాడలా వైఎస్‌కు నివాళి


వైఎస్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే గణేశ్ తదితరుల నివాళి

నర్సీపట్నం, సెప్టెంబరు 2 : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా వైసీపీ నాయకులు సోమవారం ఇక్కడ ఆయనకు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, మునిసిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, తమరాన శ్రీనివా సరావు తదితరులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : మండలంలో పలు గ్రామాల్లో వైఎస్ వర్ధంతిని నిర్వహించారు. తామరం, కొండలఅగ్రహారం గ్రామాల్లో ఎంపీపీ రుత్తల లక్ష్మి ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ నాయకులు పెట్ల భద్రాచలం, యర్రా పాత్రుడు, చిటికల రమణ, పోలిరెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట : దివంగత ముఖ్యమంతి వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పలు గ్రామాల్లో నిర్వహించారు. చీడిగుమ్మల, పాకలపాడు, జోగంపేట, గొలుగొండ, గుండుపాల, కొత్తఎల్లవరం, పుత్తడిగైరంపేట గ్రామాల్లో ఆయన విగ్రహాలకు వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లోజడ్పీటీసీ సభ్యుడు సుర్ల వెంకటగిరిబాబు, సర్పంచ్‌లు కాపారపు చిన్నబ్బాయి, పోలిరెడ్డి రాజబాబు, ఎంపీటీసీ సభ్యుడు లెక్కల అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట, నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ మణికుమారి, సర్పంచులు రఘురామ్‌చంద్రరావు, లోచల సుజాత, పందిరి సత్యంనాయుడు, ఎంపీటీసీలు చింతల బుల్లిప్రసాద్, మామిడి కృష్ణ, నాయకులు బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలనే పూజించండి : అయ్యన్న


గ్రీన్ క్లబ్ ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 2 : వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం అంతా మట్టి గణపతి విగ్రహాలకే పూజలు చేయాలని స్పీకర్ సీహెచ్. అయ్యనపాత్రుడు పిలుపునిచ్చారు. గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ముద్రించిన కరపత్రాలను సోమవారం ఆయన ఇక్కడ ఆవిష్కరించి మాట్లాడారు. గ్రీన్‌క్లబ్ గౌరవాధ్యక్షుడు డీజీనాథ్, రమణ, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు

ఈవోపై ఎమ్మెల్యే కొణతాల కన్నెర్ర

... 5వ పేజీ తరువాయి

వినియోగంలోకి తేలేకపోయామని ఈవో బదులిచ్చారు. అధికారి అయ్యి ఉండి ఇన్నిరోజులు ఎందుకు తాత్సారం చేశారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే ఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణకు ఫోన్‌చేసి మాట్లాడారు. తక్షణమే విద్యుత్ కనక్షన్ ఇచ్చి, వాటర్ ట్యాంకులకు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. 48 గంటల్లో తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే చర్యలు తప్పవని పంచాయతీ అధికారులను హెచ్చరించారు. కాగా పంచాయతీకి చెందిన ఏడు వాణిజ్య దుకాణాల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, వాటికి సంబంధించి పంచాయతీ చేసిన తీర్మానం కాపీలు ఇవ్వాలని ఈవో రమేశ్‌ను అడిగారు. ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో కొణతాల అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హెచ్చరించారు. జల్ జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కొళాయిలకు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు ఫిర్యాదులు వచ్చాయని, డబ్బులు ఎందుకు వసూలు చేశారని కొణతాల రామకృష్ణ ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో చలానా తీయడానికి డబ్బులు వసూలు చేశామని ఈవో బదులివ్వగా.. ఉచితంగా కొళాయిలు వేయాల్సి వుండగా డబ్బులు వసూలు చేసి అవినీతికి పాల్పడాల్సిన అవసరం ఏమొచ్చిందన్నారు. జల్ జీవన్ మిషన్ పథకం కింద పైపు లైన్ల నిర్మాణం జరిగి రెండేళ్లు అయినప్పటికీ ఇంటింటికీ తాగునీరు అందించకపోవడం అన్యాయమన్నారు. ఈ విషయాలన్నింటినీ ప్రభుత్వం , ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి విచారణ చేపడతామని కొణతాల చెప్పారు. కూటమి నేతలు వేగి గోపీకృష్ణ, సిద్ధిరెడ్డి శ్రీను, కాండ్రేగుల సతీశ్, వేగి దొరబాబు, బుదిరెడ్డి చిన్న, బుదిరెడ్డి మోహన్, తాకాశి కృష్ణ, పావాడ కామరాజు, వేగి రామకోటి పాల్గొన్నారు.

చోడవరం
నియోజకవర్గం


సంపద కేంద్రంలో ఎరువు తయారీ యూనిట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

▸▸ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, సెప్టెంబరు 2: పర్యావరణ పరిరక్షణ అందరూ బాధ్యతగా స్వీకరించాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పిలుపునిచ్చారు. స్థానిక పంచాయతీలోని చెత్తసంపద కేంద్రం వద్ద సోమవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పర్యావరణాన్ని అందరూ ప్రోత్సహించాలని కోరారు. పంచాయతీల్లో చెత్తసంపద కేంద్రాల ద్వారా ఆదాయం సంపాదించడంతో పాటు గ్రామాలను కూడా పరిశుభ్రంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అనంతరం మొక్కలను నాటడడంతో పాటు పంచాయతీ పారిశుధ్య సిబ్బందిని సత్కరించారు. అలాగే వర్మీకంపోస్టు యార్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ బి. చైతన్య పంచాయతీ ఈవో నారాయణరావు, సర్పంచ్ బండి నూకరత్నం, నాయకులు పెదబాబు, మత్స్యరాజు, బొడ్డేడ గంగాధర్, దేవరపల్లి వెంకటఅప్పారావు, అటవీ శాఖ డీఆర్వో రాజగోపాల్, పంచాయతీ సభ్యులు నేమాల హరి, గొర్లె కృష్ణ, బొబ్బిలి ప్రసాద్, పప్పు శ్రీను, సత్తిబాబు, మలిలబాబు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం బ్యానర్ విడుదల

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో వచ్చే నెల 2న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం బ్యానర్‌ను ఎమ్మెల్యే రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు సోమవారం విడుదల చేశారు. ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దొండా నరేష్, ఎస్.నవీన్, దొండా గిరిబాబు, ఎస్.రమేష్, దూది రాజేష్ పాల్గొన్నారు.

కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ పంపిణీ


పింఛను అందిస్తున్న కార్యదర్శి విజయ

చోడవరం, సెప్టెంబరు 2: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పట్టణంలోని ఎడ్లవీధికి చెందిన రాళ్లపల్లి దేవుడికి సచివాలయం-3 కార్యదర్శి విజయ ఆదివారం వెళ్లి పింఛను అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్లు లేకుండానే పింఛన్ల పంపిణీని సజావుగా నిర్వహించడంతో, పింఛను అందుకోలేని వారికి సచివాలయ సిబ్బంది నేరుగా వెళ్లి అందిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న నాగలక్ష్మి ఆందోళన

చోడవరం, సెప్టెంబరు 2: పట్టణంలో ఆక్రమణ పేరిట పంచాయతీ అధికారులు తొలగించిన తన ఇంటిని తిరిగి నిర్మించి ఇవ్వాలంటూ బాధితురాలు నాగలక్ష్మి చేపడుతున్న ఆందోళన సోమవారం కూడా కొనసాగింది. నాగలక్ష్మికి సంఘీభావంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు దీక్షా శిబిరం వద్ద కూర్చొన్నారు. ఆమెకు న్యాయం జరిగేవరకూ తాము అండగా ఉండి పోరాడతామని ఈ సందర్భంగా అప్పలరాజు స్పష్టం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుచేయరూ..

రోలుగుంట, సెప్టెంబరు 2: అంగన్‌వాడీ సరకులు తీసుకోవాలంటే 20 కిలోమీటర్లకు పైగా వెళ్లాల్సి వస్తున్నదని, తమ గ్రామంలోనే కేంద్రం ఏర్పాటు చేయాలని పిత్రిగెడ్డ, నీళ్లబంద గిరిజనులు సోమవారం నిరసన తెలిపారు. శరభవరం పంచాయతీ పరిధిలోని రాజన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో సరకులు తీసుకోవడానికి తీవ్ర అవస్థలు పడుతున్నామని వారు వాపోయారు. రెండు గ్రామాల్లో 20 మందికిపైగా బాలింతలు ఉన్నారని, ఐసీడీఎస్ ఉన్నతాధికారులు స్పందించి తమ గ్రామంలోనే కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

ఆయుష్మాన్ సిబ్బంది నిత్య సేవలు అందించాలి

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి


ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల, సెప్టెంబరు 2: ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు తగిన సేవలందించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మాడుగులలోని తుడుంవీధిలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో ఏయే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు, ఎన్ని పరీక్షలకు సంబంధించిన సామగ్రి అందుబాటులో ఉన్నాయని సిబ్బందిని ప్రశ్నించారు. బీపీ, షుగర్ వంటి 17 పరీక్షలు నిర్వహించేందుకు ఇక్కడ వెసులుబాటు ఉందని ఈ సందర్భంగా సిబ్బంది తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అవసరమయ్యే పరీక్షలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అలాగే వివిధ పరీక్షలకు వచ్చిన వారితో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. అలాగే అనేక సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, సీనియర్ నాయకుడు పైలా ప్రసాదరావు, ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం, జడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, సర్పంచ్ యడ్ల కళావతి, మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, టౌన్ పార్టీ అధ్యక్షుడు రంజిత్ వర్మ, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యురాలు పొలిమేర విజయలక్ష్మి, నాయకులు సూర్యనారాయణరాజు, డిల్లీ నానాజీ, మరువాడ ఈశ్వర్రావు, పంచాడ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు



చోడవరం: అన్నసమారాధనలో ఎమ్మెల్యే రాజు, నాయకులు.. మాడుగులలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బండారు

చోడవరం/బుచ్చెయ్యపేట/రోలుగుంట/మాడుగుల/మాడుగుల రూరల్/దేవరాపల్లి/చీడికాడ/కె.కోటపాడు, సెప్టెంబరు 2: చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. చోడవరంలో చిరంజీవి, పవన్ ఫ్యాన్స్‌తో పాటు కాపురాక్స్ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, జెర్రిపోతుల నానాజీ తదితరులు హాజరయ్యారు. అలాగే ఉషోదయ పవన్ జన్మదిన సందర్భంగా ఉషోదయ కాలేజీలో జెర్రిపోతుల రమణాజీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో ఎమ్మెల్యే రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, జనసేన ఇన్‌చార్జి పీవీఎస్ఎన్.రాజు, బీజేపీ రాష్ట్ర అధి కార ప్రతినిధి ఈర్లె శ్రీరామూర్తి ఆధ్వర్యంలో కస్పా గట్టుపై వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. శ్రమదానంతో డ్రైనేజీలో పూడికతీత పనులు చేపట్టారు. రోలుగుంట మండలంలోని బుచ్చెంపేటలో టీడీపీ సీనియర్ నేత ఉలబాల పోతురాజునాయుడు, వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ, జనసేన నేత గాలి బాలరాజు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. నిరుపేదలకు నిత్యావసర సరకులు అందించారు.

చీడికాడలో రక్తదాన శిబిరాన్ని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. అన్ని దానాల కంటే రక్తదానం ఎంతో గొప్పదని, ఈ శిబిరాన్ని నిర్వహించడం ప్రశంసనీయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత పైలా ప్రసాదరావు, జనసేన మండల అధ్యక్షుడు గంట్ల వరహామూర్తి పాల్గొన్నారు. కె.కోటపాడులో జనసేన మండల అధ్యక్షుడు బాలిపోయిన సంతోష్ ఆధ్వర్యంలో పవన్ జన్మదిన కేక్ కట్ చేశారు. పాచివానిపాలెంలోని అనాథ ఆశ్రమంలో చిన్నారులకు భోజనం అందజేశారు. దేవరపల్లి మండలంలోని ఎం.అలమండలో జనసేన మండల అధ్యక్షుడు గొర్రుపోటు రామ్మూర్తినాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ నేతలు పైలా ప్రసాదరావు, బి.అప్పలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పోతల పాత్రునాయుడు, కిలపర్తి భాస్కరరావు, సూర్యనారాయణ, చెరకాన సూర్యనారాయణ, కొమార బాబూరావు పాల్గొన్నారు. మాడుగుల బస్టాండ్ ఆవరణంలో జనసేన పట్టణ అధ్యక్షుడు ఇళ్లపు రమేష్ ఆధ్వర్యంలో పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఎమ్మెల్యే బండారు కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. అలాగే పీఆర్ వసతిగృహంలో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి రొబ్బా మహేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అలాగే జనసేన మండల అధ్యక్షుడు గ్రరెడ్డి శివాజీ ఆధ్వర్యంలో ఘాట్ రోడ్డు జంక్షన్‌లో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయాల్లో పవన్ కల్యాణ్ పేరిట పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతాయ్యబాబు, నాయకులు పైలా ప్రసాదరావు, పుప్పాల అప్పలరాజు, కృష్ణ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులు


చోడవరం: వైఎస్ విగ్రహం వద్ద ధర్మశ్రీ నివాళులు

చోడవరం/బుచ్చెయ్యపేట/రోలుగుంట/మాడుగుల/చీడికాడ/దేవరాపల్లి, సెప్టెంబరు 2: చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల్లో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం వైసీపీ నాయకులు చోడవరంలోని కొత్తూరు జంక్షన్, గోవాడలో ప్రభుత్వ మాజీ విప్ ధర్మశ్రీ వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, నాయకులు ఏడువాక సత్యారావు, శ్రీకాంత్, సేనాపతి సత్యారావు, డీవీఆర్, పల్లా నరసింగరావు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలోని వడ్డాది, విజయరామరాజుపేట, దిబ్బిడి, బంగారుమెట్ట, రాజాం గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు నాయకులు దొండా నారాయణమూర్తి, కె.అచ్చెంనాయుడు, వై.వాసు, కోవెల ఈశ్వరరావు, విజయకుమార్, మాణిక్యం పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోలుగుంటలోని కుసర్లపూడిలో వైస్ ఎంపీపీ కొల్లు సన్యాసినాయుడు, నాయకులు వైఎస్సార్‌కు నివాళులర్పించారు.

చీడికాడలో వైఎస్ఆర్ విగ్రహానికి పార్టీ మండల అధ్యక్షుడు జి.రాజబాబు ఆధ్వర్యంలో నాయకులు నాయుడుబాబు, శ్రీనివాసరావు, మహేష్, అప్పారావు, రామారావు నివాళులర్పించారు.

దేవరాపల్లిలోని ఎ.కొత్తపల్లిలో మాజీ డిప్యూటీ సీఎం బూడిముత్యాలనాయుడు, ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం వైఎస్‌కు నివాళులర్పించారు. మాడుగుల మండల కేంద్రంలో దివంగత సీఎం డాక్టర్ వైఎస్ఆర్ విగ్రహానికి నాయకులు పడాల కొండలరావు, రామధర్మజ, బొమ్మిశెట్టి శ్రీను, సేనాపతి కొండలరావు, సర్పంచ్ కళావతి, రమణమ్మ, విజయలక్ష్మి, జవ్వాది వరహాలు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

మాడుగుల
నియోజకవర్గం


వసతి గృహాల నిర్వాహకులతో మాట్లాడుతున్న అధికారులు

వసతి గృహాల్లో అధికారులు తనిఖీలు

దేవరాపల్లి, సెప్టెంబరు 2: మండలంలో వసతి గృహాలను తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీడీవో చంద్రశేఖర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బేతపూడి కస్తూర్బాగాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయలను పరిశీలించారు. శుద్ధ జల కేంద్రం లోఓల్టేజీ వల్ల సరిగా పనిచేయడం లేదని బాలికలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈఈతో అధికారులు ఫోన్‌లో మాట్లాడారు. వంటశాల అపరిశుభ్రంగా ఉండడం, కూరగాయలు తాజాగా లేకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం దేవరాపల్లి బీసీ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. భవనం శిథిలం కావడాన్ని చూసి తహసీల్దార్ ఆందోళన చెందారు. అనంతరం తెనుగుపూడి గురుకుల పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో సీతాఫలం ధర బేష్


సంతలో విక్రయించేందుకు తీసుకు వచ్చిన సీతాఫలాలు

మాడుగుల, సెప్టెంబరు 2: ఏజెన్సీ ప్రాంతాల్లో పండించిన సీతాఫలాలకు ఇక్కడి వారపు సంతలో మంచి ధర రావడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కక్కి, కందులపాలెం, సీతబందల, దేవాపురం, సలుగు, వంట్లమామిడి తదితర గిరిజన ప్రాంతాల్లో పండించే ఈ ఫలాలను కావిడ బరువలతో వారపు సంతలో విక్రయించేందుకు తీసుకువచ్చారు. గత వారం కంటే అధిక ధర పలికింది. గత వారం సుమారు 50 పండ్లు కలిగిన సీతాఫలం గంప రూ.250 అమ్ముడవ్వగా, అదే గంప ఈ వారం రూ.400 ధర పలికింది. దీంతో గిరి రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పశు వ్యాధుల నివారణకు టీకాలు తప్పనిసరి

చీడికాడ, సెప్టెంబరు 2: పశు వ్యాధుల నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్థక శాఖ ఏడీ చిట్టినాయుడు సూచించారు. ఎస్ఎన్ పురం గ్రామంలో సోమవారం పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ కె.సత్యవతి ప్రారంభించారు. గర్భకోశ, గాలికుంట, నట్టల నివారణకు టీకాలు వేశారు. అనంతరం పాడి రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో పశు వైద్యులు సౌజన్య, గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కె.కోటపాడు, సెప్టెంబరు 2: ఆసుపత్రి పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్థానిక ఆరోగ్య ఎదుట సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకులు నాగరత్నం, అరుణ మాట్లాడుతూ సమస్యలపై పోరాటాలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం అన్యాయమన్నారు. శ్రమకు తగిన వేతన ఇవ్వడం లేదని, ఇచ్చినవి కూడా సకాలంలో చెల్లించడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సత్యవతి, నాగేశ్వరరావు, రమణమ్మ, చిన్నయ్య, రామారావు పాల్గొన్నారు.